నల్లపిల్లి చూపు!

జోర్సల బాలశేఖర శర్మ



నిశ్శబ్దతలోనూ గంభీరం! ఇంట్లో చల్లబడ్డ వాతావరణం!! అరుణ్ మెల్లగా బెడ్‌రూమ్‌కేసి నడిచాడు. అక్కడ తార కీర్తినిజోకొడ్తూ నిద్రపుచ్చుతోంది. ఆమె కళ్ళలో కోపం ఇంకా తగ్గలేదు. ముఖంలో చికాకు.

అరుణ్ కీర్తికేసి చూశాడు. నిద్రపోతున్న మల్లెమొగ్గలా ఉంది. చిన్నారి ముఖంలో మామూలు వెన్నెల! బెదిరిన ఛాయలు అప్పుడప్పుడే కనుమరుగవుతున్నాయి.

“ఏమండీ... వాడీసారి గనుక కీర్తిని ముడితే చేతులు వాయగొడ్తానని చెప్పండి! బుద్ధిలేకపోతే సరి, ఇరవై యేళ్ళొచ్చాయ్...” అరుణ్ మౌనంగా వెళ్ళి మంచం ముందున్న కుర్చీలో కూచున్నాడు. క్షణం పాటు తల్లీకూతుళ్ళిద్దర్నీ తదేకంగా చూశాడు. తప్పుచేసిన తమ్ముణ్నైనా క్షమించని ఉరుదైన తల్లిలా తన అందాల భార్య! అంతటి అమ్మను పొందిన అదృష్టవల్లిలా చిన్నారి కూతురు!!

తారే చక్కని చుక్కలా ఉంటుందనుకుంటే కీర్తి వెన్నెల బాలలా మెరిసిపోతుంది! ‘పిల్ల ఎంతందంగా ఉందో! పెద్దయితే కుందనపు బొమ్మవుతుంది!!’ అని చూసిన వాళ్ళంతా అనుకోవడమే కాదు, నోటంట అనడం కూడా చాలాసార్లు జరిగింది. పిల్లకు దిష్టి తగిలేలా ఉంది, అంటూ తార ఒకటే ఇదయిపోవడం. తారకు అమ్మానాన్నలేరు. ఒకే ఒక్క తమ్ముడు. ఎస్.ఎస్.సిలో నాలుగైదు సార్లు తప్పి ఇక లాభంలేక ఊరికే ఇంట్లో ఆ పనీ ఈ పనీ చేస్తూ ఉంటున్నాడు. చిన్నప్పట్నుంచీ కీర్తిని ఆడించేవాడు.

పిల్లలు అందులో అందంగా ఉండే వాళ్ళు ఎవరికి మాత్రం ముద్దురారని?! అందులో ముడితే మాసిపోయేలా ఉన్న కీర్తిని వాడు మరింత ముద్దు చేస్తాడు. ఇంట్లో ఉన్నంత సేపూ దాంతోనే కాలక్షేపం. తను డ్యూటీకి వెళ్ళడం, పెద్ద పిల్లలంతా స్కూళ్ళకు పోవడం, తార ఇంటిపనిలో నిమగ్నమవడం, దీంతో కీర్తితో ఆడుకోవడానికి వాడొక్కడే మిగిలేవాడు! ఆరేళ్ళొచ్చినా కీర్తి ‘మామయ్యా’ అంటూ వాడి వెంటే ఉంటుంది. పాపం, పాపకేం తెలుసని! పసితనం! ఎలా చెబితే అలా!! అంతవరకూ బాగానే ఉంది. కానీ,....

తారకు తమ్ముడు కీర్తిని ఎక్కడ పడితే అక్కడ, ఎలా పడితే అలా ముద్దులు పెట్టుకోవడం, బుగ్గలు కొరికేయడం, ముక్కుపట్టి లాగడం, బొత్త నిమరడం లాంటి పనులుచెయ్యడమంటేనే అసలు గిట్టదు. ఇటువంటి పనులు చేసినప్పుడల్లా తమ్ముణ్ణి గట్టిగా మందలిస్తుంది. దాంతో వాడు తాత్కాలికంగా ఫూరుకునేవాడు. తెల్లారితే మళ్ళీ ఎప్పటిలానే! ఇవాళ వాడి ప్రవర్తన కొంత శృతి మించడంతో తారకు ఒళ్ళు మండింది.

కీర్తితో ఆడిస్తూ పెదవుల మీద ముద్దులు పెట్టాడు. తన నాలుకను పాపనాలుకకు తాకించడం, చంకలో వేళ్ళు పెట్టి చక్కిలిగింతలు పెట్టడం చెయ్యడాన్ని చూసినట్టుంది తార! అంతే! పాపను లాక్కుని తమ్ముణ్ణి నాలుగు తగిలించి అవతలకు పంపించేసింది! ఈ లోపు అరుణ్ లంచ్‌కు రావడంతో కొంచెం సద్దుమణిగింది. దీంతో పాప బాగా జడుసుకుంది!!

“పోనీలే తారా!... పిల్లలు కదా!?” భార్యను శాంతపరుద్దామనుకున్నాడు అరుణ్.

ఆ మాటతో తార జివ్వున తలెత్తి చురుగ్గా చూసింది భర్తకేసి! ఆ చూపులో ఎన్ని అర్థాలో ఆమెకే తెలియాలి.

.... పిల్లలు! ఈ చిన్న తనంలోనే కదూ తనకు పెద్ద ‘చురుకు’ తగిలింది!! అది ఆయనకు తెలిస్తే ఇప్పుడన్నమాట మీదే కట్టుబడి ఉంటాడా?? అటువంటి ‘చురుకు’ తన పిల్లకే కాదు, ప్రపంచంలో ఏ పిల్లలకూ తగలకూడదు!

క్షణంలో గతమంతా తారముందు తళుక్కుమంది!

తారకు తన తల్లిదండ్రులెవరో తనకే తెలియదు! నాలుగేళ్ళ వయసప్పుడు తను తిరుపతిలో తప్పిపోతే ఎవరో ముక్కు ముఖం తెలియని వాళ్ళు తీసుకొచ్చి సాకారు. అప్పట్నుంచీ వాళ్ళే అమ్మా నాన్న అయ్యారు. అప్పటికే వాళ్ళకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురుంది. ఇక తననెలా చూసేవారో వేరే చెప్పక్కర్లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే తను వాళ్ళకు ‘పనిపిల్ల’ అయ్యింది!

తను చూడటానికి ముచ్చటగా ఉండేది. తెల్లగా నిగనిగలాడేది. వాళ్ళ పిల్లలేమో నల్లగా ఉండేవాళ్ళు, అలాగని తను వాళ్ళనేమన్నా అన్నదనా? అనవసరంగా తననే బాగా ఏడ్పించేవారు. వాళ్ళు పేరుకే అన్నయ్యలు. నిజానికి ఎలా ఉండేవారో ఊహిస్తేనే అసహ్యమేస్తుంది. ఒక్కోసారి భయమేసేది. ఇంకోసారి ఏడ్పుకూడా వచ్చేది! వయసులో తనకన్నా చాలా పెద్ద! ఒకతనికి పది, ఇంకోతనికి పదమూడు ఏళ్ళుండేవి!! ఉన్న ఆ ఒక్క ఆడపిల్ల తనకన్నా చిన్న.

ఇద్దరూ ఎప్పుడూ తనను ఉడికించేవాళ్ళే! తనే అందరికన్నా ఎర్రగా ఉన్నానని ఎగతాళి చేసేవారు. అప్పుడప్పుడు అందరం కలిసి ఆడుకునేవాళ్ళం. బొమ్మరిల్లులో మొగుడూ పెళ్ళాం ఆడదామనేవాళ్ళు, తను వాళ్ళు ఎలా చెబితే అలా వినడం తప్ప ఎదురు ప్రవర్తించేది కాదు. అదేమిటో తనను ఎత్తుకోవడం కోసం ఇద్దరూ పోటీ పడేవారు. ఎవరికి ఛాన్స్ దొరికినప్పుడు వాళ్ళు ఎత్తుకునేవాళ్ళు. బుగ్గల మీదా, కడుపు మీదా ఇష్టం వచ్చినట్టు ముద్దులు పెట్టేవారు! వాళ్ళ మూతిని తన మూతికి తగిలించి పెదవుల మీద ముద్దులు పెడ్తూ నాలుకల్తో ఎంగిలి చేస్తుండేవారు. ఆరేడు సంవత్సరాల వయసు వచ్చినా నన్ను మామూలుగా వదిలేవాళ్ళు కారు! ఆడుకుందాం రమ్మని వద్దన్నా వినకుండా తీసికెళ్ళే వాళ్ళు. నేను రానని గోల చేస్తే గిచ్చడం, కొట్టడం. అది భరించలేక ఏడిస్తే తనమీద షికాయత్ చెప్పేవాళ్ళు. మొగుణ్ణి కొట్టి మొరపెట్టినట్టు ఆ ఏడుపెందుకే' అంటూ పెంచుకున్న అమ్మానాన్నలూ తననే తిట్టేవారు. ఒక్కోసారి కోప్పడ్తూ కొట్టడం కూడా చేసేవారు. స్కూల్ కు మాత్రం రెగ్యులర్‌గా వెళ్ళేది అప్పుడప్పుడు అమ్మా, నాన్న గుర్తుకొచ్చేవాళ్ళు. ఎవరికీ చెప్పకుండా ఓ మూల కూర్చుని కుమిలి కుమిలి ఏడ్చేది ఓదార్చే వాళ్ళెవరని? ఏడ్చి ఏడ్చి ఎప్పుడో ఊరుకునేదాన్ని. తనకు పధ్నాలుగేళ్ళ వయసప్పుడు వాళ్ళకు మరో కొడుకు పుట్టాడు. ఇదుగో... వాడే ఇప్పుడిలా తయారవుతాడనుకోలేదు తను!

అన్నలిద్దరూ అలాంటి వాళ్ళనుకుంటే మరోకిరాతకం మనిషి ఎదురయ్యాడు. అతని పేరు కాశీ. ఆ ఇంటికి మేనల్లుడు. అప్పుడప్పుడు ఆ ఇంటికి వచ్చేవాడు. అదేమిటో వచ్చినప్పుడల్లా తనను ఉసురు పోసుకునేవాడు. అప్పట్లో ఏదో వేరే పేరుంటే అది వద్దని చెప్పి ఇతనే ‘తార’ అని పేరు పెట్టాడట?! అదే తనకు ఇలా స్థిరపడింది!

“చుక్కలా ఉన్నవే!...దీన్ని నేనే గట్టుకుంటా!” అంటూ నన్ను ఎత్తుకుని విపరీతంగా ముద్దాడేవాడు. మీద కూచుండబెట్టుకుని చక్కిలిగింతలు పెడ్తూ అదేపనిగా నవ్వించేవాడు. పెదవుల్ని తన పెదవులకు కలిపి నాలుకను నోట్లోకి జొప్పించి అదేపనిగా ఎంగిలాడేవాడు!

ఎనిమిదేళ్ళ వయసొచ్చినా తనను వదిలేవాడు గాదు. అప్పటికే అతనికి ముగ్గురు పిల్లలు కూడా! చిన్న పిల్లపై ‘పెద్ద’ చేష్టలు..

“నేను పేరు పెట్టిన పోరి ఎటుపాయె?...” అంటూ ఇల్లంతా తిరిగి తను ఏ మూల ఉన్నా పట్టుకుని ఎత్తుకు తెచ్చుకునేవాడు. ఎనిమిదేళ్ళ పిల్లని కూడా చూడకుండా ఎంత దారుణంగా ప్రవర్తించేవాడో...

“నువ్ సిన్మా తారలాగుంటవే తారా!.. ఇన్ని మంచినీళ్ళు తీస్కరాపో!” తను పట్టించుకోకుండా ఫూరు కుంటే అమ్మా, నాన్నలు: “వాడు నీకు బావే!.. ఏదో పరాచకాలాడ్తడు, గాయింత దానికే అట్టయిపోతవా?... పో! నీళ్ళివ్వుపో!” అని తననే మందిలించేవాళ్ళు!

నీళ్ళగ్లాసందుకుంటూ ఇంకోచేత్తో తన చెయ్యి పట్టి “ఇట్లామ్మంటే రాకుండ ఉంటవేమే” అంటూ అమాంతం లాక్కునేవాడు అందరిముందే! అమ్మా, నాన్న చూస్తూ నవ్వుకునేవారేగానీ వద్దని వారించేవారు కాదు. అందరి ముందే బుగ్గలు కొరికేవాడు! సిగరెట్ పెట్టె ఇవ్వమనోసారి, అగ్గిపెట్టె తెమ్మనోసారి తనను పిలిపించుకుని అవి ఇస్తున్నప్పుడు తన చేయిపట్టి లాగేసుకునేవాడు. బలవంతంగా ఒళ్ళో కూచోబెట్టుకునేవాడు. మెల్లగా చంకల కింది నించి చేతులు పెట్టి ఛాతిమీద గట్టిగా నొక్కేవాడు! చిన్న తనంలో ఇలా ప్రవర్తించాడంటే సర్దుకోవచ్చేమో గానీ తనకు తొమ్మిది పదేళ్ళు వచ్చినా కూడా అలాగే చేసేవాడంటే ఎంతటి సంస్కారవంతుడో తెలుస్తుంది.

ఇంతాచేసి ఊరుకుంటే బాగుండేదేమో! అప్పుడప్పుడే పెరుగుతున్న తన వయసుతో దోబూచులాడుతూ తననెంతగా హింసించాడో!? ఎవరూ లేని సమయం చూసి పెదవులు ముద్దాడేవాడు. అదేమిటో ఆ వయసులో అతనలా తన పెదవులను స్పృశిస్తూ నాలుకను నాలుకతో తాకిస్తుంటే ఒంట్లో ఒక్కసారిగా కరెంట్ షాక్‌లా ఏదోలా అయ్యేది! ఆ స్థితిలో అది చెడ్డపనని గ్రహించగల జ్ఞానం తనకు లేకపోలేదు! కానీ, ఎంత గింజుకున్నా వదిలేవాడు కాదు. ఒక్కోసారైతే మరింత మొరటుగా ప్రవర్తించేవాడు. తను తెల్లగా పాలకోవాలా బాగా అందంగా ఉంటుందట! “నువ్ నాకాడ్నే ఉండిపోవే” అంటూ ఎవరూ లేకుండా చూసి అనేవాడు! ‘ఈ లంగా జాకెట్‌లో నువ్ ఇంకా బాగుంటవే!” అంటూ జాకెట్లోంచి చేతులు లోపలికి పెట్టి కడుపును నిమురుతూ ఛాతీ దగ్గర నొక్కేవాడు. మోకాళ్లవరకూ తన కాళ్ళను నిమురుతూ ఇంకెంత మోటుగా ప్రవర్తించేవాడో తలుచుకుంటే అసహ్యమేస్తుంది. ఈ పనులు చేసేప్పుడు తన దృష్టిని మరో వైపు మరల్చేందుకు పైకి అవీ ఇవీ కబుర్లు చెప్పేవాడు.

ఆ రోజు. .. తనకు ఇప్పటికీ గుర్తుంది! సత్యనారాయణస్వామి వ్రతం చేసుకుంటున్నామని చెప్పి అందర్తో పాటు తననూ వాళ్ళ ఫూరు తీసుకెళ్లాడు కాశీ. అక్కడ చాలామందితో కలిసి రెండు మూడ్రోజులు ఆనందంగా గడిపాను. అంతకు ముందురోజే చుట్టాలంతా వెళ్ళిపోయారు. మేం ఒక్కళ్ళమే ఆ మర్నాడు వెళ్ళాల్సి ఉంది. ఆ వేళ.. కాశీ తన గదిలో ఉండి.

“ఇన్ని మంచినీళ్ళు తెస్తావే తారా!...” అంటూ పిలిచాడు. పైగా అక్కడున్న ఒకరిద్దరూ “వంటింట్లో ఉన్నాయ్ .తీస్కెళ్ళివ్వే” అని నన్నే పురమాయించారు. గది తలుపులు వేసే ఉన్నాయి. తప్పదనుకుని యథావిధిగా మంచినీళ్ళ చెంబుతో గదిలోకి వెళ్ళి ఇవ్వబోయాను. వెంటనే చెప్పుడుకాకుండా తలుపులు మూసేశాడు. ‘జరసేపు ఈడ పడుకోవె. బయటేం జేస్తవ్’ అంటూ చెంబుతో పాటు తన చెయ్యి పట్టుకుని మీదికి లాక్కున్నాడు. టకటకా జాకెట్ హుక్స్ తొలగించసాగాడు. తను తేరుకునేలోపే బయటనుంచి ‘కాశీ!’ అంటూ ఎవరో పిలిచాడు. అంతే! అదిరిపడ్డట్టుగా తనను వదిలేసి నిండా దుప్పటి తన్నుకుని పడుకున్నాడు ఏమీ తెలియనట్టు. ఆ పాటికే తన హుక్ తొలగిపోయి ఉండడంతో గదిలోకొచ్చిన ఆవిడ “అయ్యో.. అయ్యో.. ఎంతకు తెగించింది!?” అంటూ నానా రభస చేసింది. అందమైన పసితనం ఎంతశాపమో, ఆడపిల్లగా పుట్టడం ఎంత దోషమో ఆ చిన్న వయసులో తనకర్థంకాకపోయినా ఆ తర్వాత అర్థమైంది! ఆ వేళ అందరూ తనను తిట్టేవాళ్ళే. తమ పరువు తీశావంటూ ఆ అమ్మా నాన్నలూ ఎంతగా కొట్టారో. ఏమీ తెలియనట్లు “పోనీలేండి. చిన్నపిల్ల...” అంటూ అమాయకుడిలా లేచిన కాశీది తనను కాపాడే ప్రయత్నం. తనది ఎవరిని ఏమనాలో. ఎవరి నిజం చెప్పాలో తెలియని నిస్సహాయస్థితి. తిరుపతిలో దైవసన్నిధిలో తనను పోగొట్టుకున్న కన్నవాళ్ళదా?.. లేక తన దౌర్భాగ్యానిదా?... ఎవరిది పాపం?!

ఆ తర్వాత ఏడాదికే తనను అరుణ్‌కిచ్చి పెళ్ళి చేసేశారు. నింద చెడ్డదైనా ఫలితం మంచిదైందనిపించింది. కాలగమనంలో వాళ్ళ పిల్లలందరికీ పెళ్ళవడం, చిన్నాడు పెద్దపెరక్కముందే ఇద్దరూ చనిపోవడం, వాడికి ఎక్కడా దిక్కులేక తన పంచన చేరడం... జరిగిపోయాయి. ఇప్పుడు వాడే తన కీర్తిపట్లనల్లపిల్లి చూపును పోలిన చేష్టలు చేస్తున్నాడు.. పిల్లల్ని ప్రేమించడం తప్పుకాదు. కానీ.. పసితనమేకదాని ఎలా పడితే అలా శారీరక స్పర్శను కల్గిస్తే అది వాళ్ళ లేతమనసు పై ఎలా ముద్రవేస్తుందనడానికి తనే ఒక నిదర్శనం. అదే అలవాటును పిల్లలు పెద్దవుతున్నా కంటిన్యూ చేయడాన్ని ఏ పరాచకాలు గానో, ప్రేమ పనులుగానో ఎలా తీసేయగలం? తెలిసీ తెలియని ఆ వయసు చివరకు దానికే అలవాటు పడితే ఆ పాపం ఎవరు మోస్తారు?! ఎందరు మామలు, ఎందరు బావలు, మరెందరు తాతలు, ఇంకెందరు వరుసల్లేని వాళ్ళు నల్లపిల్లి చూపులు లేకుండా ఉన్నారు??? విరిసీ విరియని పసితనాన్ని కళ్ళకద్దుకుని కాపాడుకోకుండా అందిందికదాని అరచేత్తో నలిపేస్తే అది పశుత్వం అన్పించుకుంటుంది.

“అలా చూస్తున్నావేం తారూ.. మరీ అంతలా హర్ట్ అయ్యావా?!” 30 ఏళ్ళ అరుణ్ పాతికేళ్ళ తారను దగ్గరకు లాక్కున్నాడు ప్రేమగా, “వాడే కాదండీ! ఇకనుంచీ పిల్లల్ని ఎవరూ అలా చేయకూడదు” తార కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర! ఆ పొరవెనుక భయపెడ్తున్న ఒక నల్లపిల్లి చూపు.. మీద పడ్తున్న ఉప్పెనలా!

పిల్లలను ఎత్తుకోవడం, ఆడించడం, ముద్దాడటం అతిశయోక్తి కాదు, అసహజమూ కాదు. ఇది అందరు చేసేపనే. అందరూ మావయ్యలూ, అందరు బావలూ, అందరు తాతలూ, అలాంటి వారు కారు కనుకనే స్వచ్ఛమైన మమతానురాగాలు ఇంకా బతికున్నాయి.

నల్లపిల్లి ఎక్కడోకానీ ఉండదు. ఉంటే మాత్రం దాని బారిన పడకూడదు. చూపుకు బలయిపోకూడదు!

బరువెక్కిన తార గుండెల్లోని భావనలు తేలికపడ్డాయి.

పాపను జోకొడుతున్న ఆమె కుడిచేయి ఎప్పుడు ఆగిందో.. కాలం టక్కున ఆగింది, అమ్మ లాలిపాట ఆగినట్టు, ఊయల ఉన్నట్టుండి వణికినట్టు!

ఒక్క మారుగా పాప నిద్రలోనే ఉలిక్కిపడింది. బెదిరి బెదిరిపోసాగింది. ‘కీర్తీ...’ అంటూ తార పాపను హత్తుకుంది. ఆమె ఒడి కలుక్కుమంది. కన్నప్రేమ గుండెల్లోంచి తన్నుకొచ్చింది. ‘నా కీర్తికి అలా జరక్కూడదు. ఎన్నటికీ జరగనివ్వను’ అనుకుంటూ ఒడిలో పొదుముకుంది.

అరుణ్ ఉన్నట్టుండి కుర్చీలోంచి లేచి వచ్చి తల్లీ బిడ్డలను చేరాడు తార భుజంపై చెయ్యేస్తూ...